సాక్షి
అనకాపల్లి
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



త్వరలో 'సక్సెస్ సెమెన్' 8లో

ఆడ పెయ్యిలు మాత్రమే జన్మించే 'సక్సెస్ సెమెన్' కార్యక్రమాన్ని త్వరలో చేపడతామని విశాఖ డెయిరీ ఛైర్మన్ చెప్పారు.



షూటింగ్ సందడి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మెట్లమార్గంలో మంగళవారం సముద్రఖని నటిస్తున్న తమిళ సినిమా షూటింగ్ జరిగింది.

వాతావరణం

అనకాపల్లి టౌన్ : రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 33.8 నుంచి 34.8 డిగ్రీలు, గాలిలో తేమ శాతం 63 నుంచి 64, గాలి గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

పుష్కలంగా ప్రాణవాయువు




మాక్‌డ్రిల్‌లో కరోనా రోగికి ఆక్సిజన్ అందిస్తున్న వైద్యుడు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కోవిడ్ మాక్‌డ్రిల్ రెండో రోజూ కొనసాగింది. మంగళవారం వైద్యాలయం సూపరింటెండెంట్ పి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా రోగులకు వైద్యాలయంలో 85 ఆక్సిజన్ బెడ్లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఎన్95 మాస్కులు, ఆక్సిజన్ సిలిండర్లు, రోగికి కావలసిన వెంటిలేటర్లు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవో భారతి, వైద్యులు లక్ష్మణనాయక్, శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ పరీక్షకు ప్రత్యేక జాగ్రత్తలు

అనకాపల్లిటౌన్: పదోతరగతి సైన్స్ పరీక్షకు రాసేటపుడు విద్యార్థులు కాస్త అప్రమత్తంగా ఉండాల్సిందిగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. 13న జరగనున్న ఫిజికల్ సైన్స్, బయాలజీకి కలిపి ఒకే ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. ప్రశ్నాపత్రంలోని పార్టు-1లో 1 నుంచి 16వ ప్రశ్న వరకు ఫిజికల్ సైన్స్ ప్రశ్నలు, పార్ట్-2లో 17 నుంచి 33వ ప్రశ్నలు బయాలజీ సబ్జెక్టుకు చెందినవిగా గుర్తుంచుకోవాలన్నారు. వీటికి వేర్వేరుగా ఓఎంఆర్ షీట్‌తో కూడిన 12 పేజీల సమాధాన పత్రాలను విద్యార్థులకు అందించనున్నట్టు పేర్కొన్నారు. సమాధాన పత్రంపై కూడా ఫిజికల్ సైన్స్, బయాలజీ పేర్లు ముద్రించి ఉంటాయని, ఏ సబ్జెక్టుకు సంబంధించిన సమాధానాలను ఆ సమాధాన పత్రంలోనే రాయాల్సి ఉంటుందన్నారు. పరీక్ష సమయంలో కూడా ఎలాంటి మార్పుల్లేవన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్లు ఈ విషయంపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. పరీక్ష హాల్లో కూడా ఇన్విజిలేటర్లు దీనిపై విద్యార్థులకు తెలిపేలా, ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు.

బీఎస్ఎన్ఎల్‌తో ఎంఎస్ఎంఈ ఎంవోయూ



ఎంఓయూ కుదుర్చుకున్న బీఎస్ఎన్ఎల్, ఎంఎస్ఎంఈ అధికారులు

రాంబిల్లి: బీఎస్ఎన్ఎల్‌తో స్థానిక సెజ్‌లోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఎంవోయూ కుదుర్చుకున్నట్టు ఎంఎస్ఎంఈ సెంటర్ డీజీఎం జి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడి ఎంఎస్ఎంఈ సెంటర్ వద్ద బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్‌తో ప్రసాదరెడ్డి సమావేశమై పరస్పరం సంతకాలు చేశారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ, బీటెక్, డిప్లమో చదువుకున్న విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీస్ ప్రత్యేక విభాగాల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం అందించేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్లు ప్రసాదరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం బి.ఎస్.శ్రీనివాస్, ఎస్‌డీఈ తిరుపతినాయుడు పాల్గొన్నారు.

నేడు 30 మందికి నియామకపత్రాల అందజేత

తాటిచెట్లపాలెం: రోజ్‌గార్ మేళాలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 71 వేల మంది అభ్యర్థులకు గురువారం ప్రధాని మోదీ వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేయనున్నారు. దేశవ్యాప్తంగా రైల్వేలో 15 వేల మంది ఎంపికవ్వగా.. అందులో వాల్తేర్ డివిజన్ పరిధిలో 30 మంది ఉన్నారు. పోర్టు కళావాణి ఆడిటోరియంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో 30 మందికి నియామక పత్రాలు అందజేస్తామని వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. వీరికి కర్మయోగి ప్రారంభ్ ఆన్‌లైన్ ఓరియంటేషన్ కోర్సు ద్వారా శిక్షణ ఇస్తున్నారు.

సహస్ర ఘటాలతో మోదకొండమ్మకు నీరాజనం



కనుల పండువగా మోదకొండమ్మ ఘటాల పండగ, (ఇన్‌సెట్) ఘటాలను శిరస్సున పెట్టుకుని కాలినడకన వస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఘటాల పండగ మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. మోదమాంబ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఈ వేడుకను నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఘటాన్ని శిరస్సున పెట్టుకుని అమ్మవారి దర్శనానికి వచ్చారు. కాలనీవాసులు సుమారు వేయి ఘటాలతో డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద

గ్రామాల్లో సైతం పారిశుధ్యం మెరుగుపడాలి. తడి, పొడి చెత్తల్ని వేర్వేరుగా సేకరించాలి. వాటిని సేంద్రియ ఎరువుగా మార్చాలి. దీని ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయ వనరులు సమకూరాలి. ఇదే జగనన్న స్వచ్ఛ సంకల్పం. ఇందులో భాగంగానే జిల్లాలోని 645 పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 600 పంచాయతీల్లో షెడ్ల నిర్మాణం పూర్తయి, సేంద్రియ ఎరువు తయారవుతోంది. మిగిలిన చోట్ల కూడా షెడ్ల నిర్మాణ చర్యలు ఊపందుకున్నాయి.



వెదురుపల్లి పంచాయతీ సంపద తయారీ కేంద్రంలో వానపాములను వదులుతున్న డీపీవో శిరీషారాణి

- సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువు
- జిల్లాలో 645 పంచాయతీల్లో సంపద కేంద్రాలు
- ఇప్పటికే 600 కేంద్రాల్లో షెడ్ల నిర్మాణం పూర్తి
- ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగుకు ఊతం

సాక్షి, అనకాపల్లి : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వంటింటి వ్యర్థాలను ఆదాయ వనరుగా మార్చే ప్రక్రియలో పురోగతి నెలకొంది. జగనన్న ప్రభుత్వం స్వచ్ఛ సంకల్పం పేరిట చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసి, వాటిని రైతులకు విక్రయిస్తూ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుస్తోంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకే పరిమితమైన తడి, పొడి చెత్త సేకరణ గ్రామ పంచాయతీల్లో కూడా చురుగ్గా సాగుతోంది.

రూ.60 కోట్లతో షెడ్ల నిర్మాణం

జిల్లాలోని 24 మండలాల్లో 645 పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే దాదాపు 600 పంచాయతీల్లో షెడ్లు నిర్మించారు. మిగిలిన 45 చోట్ల కూడా షెడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఒక్కో షెడ్డుకు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షలు వెచ్చించారు. ఇందుకు జిల్లాలో సుమారు రూ.60 కోట్లు ఖర్చుచేశారు. షెడ్లు పూర్తయిన చోట, ఆ పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించి, సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఇలా తయారైన ఎరువును మార్కెట్ కంటే తక్కువ ధరకే రైతులకు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామ స్థాయిలోనే 'చెత్త'శుద్ధి!

ప్రతి గ్రామంలో పరిశుభ్రత ఉండాలన్నది జగనన్న స్వచ్ఛ సంకల్పం నినాదం. ఇందులో భాగంగా తడి, పొడి చెత్తను ఇంటి వద్దే వేరుచేసి సంపద కేంద్రాలకు తరలించేలా గ్రామ స్థాయిలోనే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీని కోసం ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త నిల్వ కోసం ప్రత్యేక డబ్బాలను పంపిణీ చేశారు. తమ ఇంటితోపాటు, గ్రామంలో కూడా పరిశుభ్ర వాతావరణం ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించారు. ప్రజలే గ్రీన్ అంబాసిడర్లకు సహకరించి చెత్తను వేర్వేరుగా అందిస్తే తమ సిబ్బందికి కొంత ఇబ్బంది తప్పుతుందని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం

గ్రామాల నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాల్లోని కంపోస్ట్ పిట్‌లలో వేసి, ఆవుపేడ, వానపాముల్ని కలిపి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఈ ఎరువును రైతులకు విక్రయిస్తున్నారు. కశింకోట, తుమ్మపాల, పాయకరావుపేట తదితర చోట్ల సంపద కేంద్రాల్లోని ఖాళీ స్థలంలోనే సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరల్ని సాగుచేస్తున్నారు. వీటిని ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి, హాస్టళ్లకు నామమాత్రపు ధరకు అందిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు స్థానికులు కూడా ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇపుడిపుడే ఊపందుకుంటున్న ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగుకు కూడా ఈ సంపద తయారీ కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయి.

పంచాయతీలకు అదనపు ఆదాయం



చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి, విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయ వనరుల్ని సమకూర్చుకోవచ్చు. జిల్లాలో 600 వరకు షెడ్లు నిర్మించాం. వానపాముల్ని వేసి, చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చుతున్నాం. తడి, పొడి చెత్తల్ని వేర్వేరుగా సేకరించడంతో వీధులు కూడా పరిశుభ్రంగా ఉంటాయి. ప్రజలు రోగాల బారిన పడకుండా నియంత్రించవచ్చు. కార్పొరేషన్, మున్సిపాలిటీల స్థాయిలోనే గ్రామాల్లో కూడా పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇపుడిపుడే గ్రామాల్లో చైతన్యం పెరుగుతోంది.

– శిరీష రాణి, డీపీవో, అనకాపల్లి

సామాజిక న్యాయానికి పునాది వేసిన మహనీయుడు



తారువలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

- ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి
- నివాళులర్పించిన డిప్యూటీ సీఎం, ఎంపీ, కలెక్టర్

దేవరాపల్లి/మాడుగుల/అనకాపల్లి టౌన్: మహాత్మ జ్యోతిరావ్ పూలే దేశంలో సామాజిక న్యాయానికి పునాదులు వేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలోని తన క్యాంప్ కార్యాలయంలో, మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన పూలే జయంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి జ్యోతిరావు పూలే విశేష కృషి చేశారన్నారు. మహిళా విద్యాభివృద్ధికి ఆ మహనీయుడు మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. 1848లో తన భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో పూనేలో దేశంలోనే ప్రథమంగా స్త్రీల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, జగ్జీవన్ రామ్, కొమరం భీమ్‌లను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్‌సీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శేనాపతి కొండలరావు, దేవరాపల్లి మండల కన్వీనర్ కె.వి.రమణ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పూలే ఆశయసాధనకు యువత కృషి చేయాలి

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి అన్నారు. అనకాపల్లి గుండాల జంక్షన్‌లోని జీవీఎంసీ కల్యాణమండపం మేడపైన బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగువర్గాల వారిలో చైతన్యం తీసుకువచ్చి సమాన హక్కుల కోసం పోరాటాలు చేసిన పూలే ఆశయాలను నేటి యువత ఆచరించాలని చెప్పారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ మహాత్మా పూలే సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడన్నారు. భగవంతుడు ఒక్కడేనని, ఆయనను ప్రతి వారు ఆరాధించవచ్చని బోధించారని, వర్ణ వివక్ష లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా పూలే గురించి అద్భుతంగా ప్రసంగించిన తొమ్మిదో తరగతి విద్యార్థులు హరదీపిక, జోత్స్నలను కలెక్టర్, ఎంపీలు అభినందించారు. డీఆర్వో పి.వెంకటరమణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి కె.రాజేశ్వరి, తెలుకల కార్పొరేషన్ డైరెక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

వలంటీర్‌పై టీడీపీ నేత కుటుంబం దాడి

- ఇంటి పన్ను వసూలుకు వెళ్లినందుకు ఆగ్రహం
- రెండోసారి దౌర్జన్యం చేయడంతో తిరగబడ్డ వలంటీర్ కుటుంబ సభ్యులు
- ఇరు వర్గాల పరస్పర ఫిర్యాదులు.. 12 మందిపై కేసు



టీడీపీ నేత కుటుంబ సభ్యుల దాడిలో గాయపడ్డ వలంటీర్ శివ, అతని తాత రామస్వామి

బుచ్చెయ్యపేట: ఇంటి పన్ను వసూలుకు సచివాలయ సెక్రటరీతో కలిసి వెళ్లిన గ్రామ వలంటీర్‌పై టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటన బుచ్చెయ్యపేట మండలం నీలకంఠాపురంలో జరిగింది. గ్రామ సచివాలయ పంచాయతీ సెక్రటరీ వసంతతో కలిసి గ్రామ వలంటీర్ పడాల శివ మంగళవారం గ్రామంలో ఇంటి పన్ను వసూలు చేపట్టారు. అందరి ఇళ్లకు వెళ్లినట్లే మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ ఇంటికి వెళ్లి మూడు సంవత్సరాల ఇంటి పన్ను కట్టవలసి ఉందని డిమాండ్ నోటీసు ఇచ్చారు. దీనిపై మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తమ కుటుంబానికి ఏమీ రాలేదని వలంటీర్‌పై ఎదురు ప్రశ్నలు వేశారు. 'ఈ ఏడాదిలోనే మీ కుటుంబానికి రైతు భరోసా, అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ ఇతర పథకాల ద్వారా రూ.85 వేలు అందించింద'ని వలంటీర్ వివరించారు. తమ కుటుంబానికి మరికొన్ని పథకాలు రాలేదని వలంటీర్‌తో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు గొడవపడ్డారు.

మాటామాటా పెరిగి వలంటీర్‌పై దాడి చేశారు. దీంతో ఘర్షణ విషయం తెలుసుకున్న వలంటీర్ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం పోలీసు కేసు పెట్టేందుకు వెళుతుండగా రాజాం వెదుళ్లగెడ్డ బ్రిడ్జి వద్ద వలంటీర్ కుటుంబ సభ్యులపై మాజీ సర్పంచ్ తదితరులు మరోమారు దౌర్జన్యానికి దిగారు. దాంతో వలంటీర్ కుటుంబ సభ్యులు తిరగబడ్డారు. ఈ ఘటనలో వలంటీర్ చెయ్యి దెబ్బతినగా అతని తాత ప్రగడ రామస్వామికి గాయాలయ్యాయి. మాజీ సర్పంచ్ సత్యనారాయణకు గాయాలవగా ఇరువర్గాలవారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గాయపడ్డ ఇరువర్గాలవారు అనకాపల్లి ఏరియా ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ కుమారస్వామిని వివరణ కోరగా గ్రామ వలంటీర్ ఆరుగురిపైన, మాజీ సర్పంచ్ వర్గీయులు ఆరుగురిపైన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఇద్దరు ఎంపిక



సాయికిరత్, వినయ్‌కుమార్‌లను మెమెంటోలతో సత్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 20, 118 ర్యాంక్‌లు సాధించిన సీహెచ్ సాయికిరత్(గాంధీనగరం), జె.వినయ్‌కుమార్(కశింకోట)లను మంగళవారం ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సైనిక్ స్కూల్స్‌లో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సైనిక్ స్కూల్ శిక్షణ ఉపాధ్యాయులు ఎం.ఉమామహేశ్వరరావు, డి.నూకరాజు, ఎంపీ భర్త కాండ్రేగుల విష్ణుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ-98 అభ్యర్థులకు కౌన్సెలింగ్

- అంగీకార పత్రాల స్వీకరణ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో పోస్టింగ్‌లు



అంగీకారపత్రాలను ఇస్తున్న అభ్యర్థులు

విశాఖ విద్య: డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉపాధ్యాయులుగా నియామక పత్రాలను అందించేందుకు సర్వం సిద్ధమైంది. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థుల నుంచి మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారులు అంగీకార పత్రాలను స్వీకరించారు. విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాల మేరకు సిద్ధం చేసిన జాబితాలో 355 మంది ఉద్యోగాలకు అర్హులుగా లెక్క తేలారు. వీరందరికీ బుధ, గురువారాల్లో కౌన్సిలింగ్ నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశారు.

నేడు 1 నుంచి 200 వరకు..

జాబితాలో 1 నుంచి 200 నంబర్ల వరకు పేర్లు ఉన్న అభ్యర్థులకు బుధవారం, 201 నుంచి 355 వరకు గురువారం కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారులు వెల్లడించారు. ఈ మేరకు డీఈవో కార్యాలయ నోటీసు బోర్డులో వివరాలు ఉంచారు.

మూడు జిల్లాల్లో పోస్టింగ్‌లు

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని పాఠశాలల్లో వీరిని నియమించనున్నారు. 20 నుంచి 30 మధ్య విద్యార్థులు ఉన్న పాఠశాలల వివరాలను ఎంఈవోల నుంచి సేకరించారు. అదే విధంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో, సీఆర్పీలు అవసరమైన చోట్ల డీఎస్సీ-98 వారిని నియమించేలా ఖాళీల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులు సిద్ధం చేశారు.

355 మందికి పిలుపు : డీఎస్సీ-98లో ఉమ్మడి అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 6,190 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, ఇందులో 2,453 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. న్యాయపరమైన వివాదాలతో నియామకాలకు అప్పట్లో బ్రేక్ పడింది. వీరి గురించి పాలకులెవ్వరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవతోనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అయింది. ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 423 మంది హాజరై, ఉద్యోగాల్లో చేరుతామని అంగీకర పత్రాలను విద్యాశాఖాధికారులకు అందజేశారు. 13-03-2023 తేదీ కటాఫ్‌గా తీసుకొని 60 ఏళ్ల పదవీ విరమణ వయస్సును నిర్ధారించి, ఉద్యోగాల్లోకి తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తాజాగా అర్హత గల 355 మందిని ఎంపిక చేసి, కౌన్సెలింగ్‌కు పిలిచారు. కాగా వీరిలో ఇద్దరు అభ్యర్థులకు 60 ఏళ్లు నిండిపోవటంతో ఏం చేయాలనే దానిపై ఉన్నతాధికారులకు నివేదించారు.

కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన

- మొత్తం సిబ్బంది బదిలీ..11 మంది నియామకం 8లో

క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

- 25 కిలోల కణితి తొలగింపు



శస్త్రచికిత్స చేసి కణితి బయటకు తీస్తున్న వైద్యులు

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగి గ్రామానికి చెందిన బిసాయి కనకరత్నం(70) కడుపునొప్పి, ఉబ్బరంతో బాధపడుతూ ఈ నెల 5న ఏరియా ఆస్పత్రిలో చేరింది. అక్కడ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవి పర్యవేక్షణలో జనరల్ సర్జన్ వైద్యులు ప్రధాన్, నరేంద్ర, ఎస్.ఎన్.సూర్యకుమారి పరీక్షలు చేసి కడుపులో కణితి ఉందని నిర్ధారించారు. మంగళవారం ఆమెకు శస్త్రచికిత్స చేసి కడుపులో 25 కిలోల కణితిని తొలగించారు.

ఆర్టీసీకి ఫస్ట్ ఎయిడ్ కిట్ల వితరణ



సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేస్తున్న డీఎం ధీరజ్, వైద్యుడు మల్లికార్జున్

నర్సీపట్నం: ప్రమాదాల సమయంలో వినియోగించే ఫస్ట్ ఎయిడ్ కిట్లను స్థానిక చిన్న పిల్లల వైద్యుడు మల్లికార్జున్ ఆర్టీసీ బస్సులకు ఉచితంగా అందజేశారు. మంగళవారం నర్సీపట్నం డిపోలో వంద ఫస్ట్ ఎయిడ్ కిట్లను మేనేజర్ ధీరజ్ సమక్షంలో సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా డీఎం ధీరజ్ మాట్లాడుతూ బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు చిన్న చిన్న గాయాలు తగిలిన సమయంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఎంతో దోహదపడతాయన్నారు. కిట్లు అందజేసిన వైద్యుడికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



మాడుగులలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు తదితరులు

సాక్షి, అనకాపల్లి/మాడుగుల: సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందుతున్నాయా.. లంచం, వివక్ష లేకుండా అర్హులందరికీ న్యాయం జరుగుతోందా.. అని ప్రశ్నిస్తే ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ సమాధానాలు చెప్పారు. జగనన్నే మళ్లీ సీఎం కావాలని ముక్తకంఠంతో చెప్పారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం మాడుగులలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలకు సమాధానాలు అడిగి నమోదు చేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం 98.4 శాతం పనులు నెరవేర్చారని, రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు అందజేయడానికి సీఎం కృతనిశ్చయంతో ఉన్నారని వివరించారు. అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు. ఇళ్లకు వారి అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అతికించారు. ఆయన వెంట ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఉన్నారు. కోటవురట్ల మండలం లింగాపురంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'జగనన్ననే మళ్లీ సీఎం చేసుకుందాం' అని బాబూరావు చెప్పగా ప్రజలంతా మద్దతు పలికారు.

త్వరలో ఆడ పెయ్యిల జనన కార్యక్రమం

- విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్



విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్‌కు పాడి రైతుల సత్కారం

కశింకోట: మండలంలోని జోగారావుపేటలో మొదటి సారిగా పాడి పశువులకు ఆడ పెయ్యిలు మాత్రమే జన్మించే 'సక్సెస్ సెమెన్' కార్యక్రమాన్ని చేపడతామని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ తెలిపారు. ఇందుకయ్యే ఖర్చులో 30 శాతం రైతులు భరించాల్సి ఉంటుందన్నారు. మిగిలిన 70 శాతం డెయిరీ నుంచి సమకూరుస్తామన్నారు. మండలంలోని బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం శివారు జోగారావుపేట గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సానుకూలంగా స్పందించారు. పాడి పశువుల పాకల నుంచి పాల కేంద్రాల వరకు పాలు తీసుకు రావడానికి అనువుగా రోడ్లను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. పశువుల పాకల వద్ద నీటి సదుపాయం కల్పించడానికి బోర్లు ఏర్పాటు చేస్తామన్నారు. బుచ్చియ్యపేటలో 30, జోగారావుపేలో 15 వంతున గడ్డి కోత యంత్రాలు మంజూరు చేస్తామన్నారు. రూ.30 వేలు విలువ కలిగిన యంత్రానికి సగం రాయితీ ఉంటుందన్నారు. అనంతరం ఆనందకుమార్‌ను పాడి రైతులు ఘనంగా సత్కరించారు. డెయిరీ డైరెక్టర్లు మలసాల రమణారావు, శ్రీరంరెడ్డి సూర్యనారాయణ, డెయిరీ డీజీఎం పాద్యరాజన్, అనకాపల్లి యూనిట్ మేనేజర్ ఎస్. రమణ, బుచ్చియ్యపేట సర్పంచ్ కోన నాయుడు, పాల సంఘాల అధ్యక్షులు బుదిరెడ్డి రామారావు, అల్లం సన్యాసిరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన

- ఈ కేంద్రం పనితీరుపై కొంతకాలంగా విమర్శలు
- మొత్తం సిబ్బంది బదిలీ.. కొత్తగా 11 మంది నియామకం
- అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వో నిర్ణయం



కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్

మహారాణిపేట: ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్‌ను ప్రక్షాళనకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న సిబ్బందిపై బదిలీ వేటు వేసి.. కొత్త సిబ్బందిని నియమించింది. కేజీహెచ్‌కు మన్యం ప్రాంతానికి చెందిన 11 మండలాల గిరిజనులు, ఉమ్మడి ఉత్తరాంధ్ర ప్రాంతం, ఒడిశా, చత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన గిరిజనులు వైద్యం కోసం వస్తుంటారు. నెలకు నాలుగు వేల మంది వరకు చికిత్స పొందుతుంటారు. ఈ నేపథ్యంలో గిరిజనుల బాగోగుల కోసం పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో గిరిజన సేవా, సమాచార కేంద్రం పేరిట కేజీహెచ్‌లో ప్రత్యేకంగా ఎస్టీ సెల్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 9 మంది సిబ్బందితో సేవలు ప్రారంభించగా.. తర్వాత కాలంలో నలుగురితో నడిచింది.

సిబ్బంది ఇష్టారాజ్యం

గిరిజనుల వైద్యం కోసం ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చిస్తోంది. అనారోగ్యంతో వచ్చే గిరిజనులను వైద్యులకు చూపించడం, అవసరమైన పరీక్షలు, స్కానింగ్ చేయించడం ఈ సెల్ ఉద్యోగుల బాధ్యత. గిరిజనులకు భోజనాలు, మందులు, తిరిగి ప్రయాణానికి ఖర్చులు కూడా ఇవ్వాల్సిందే ఈ సెలే. కానీ ఇందుకు భిన్నంగా ఇక్కడ జరుగుతోంది. అన్ని ఉచితంగా ఇవ్వాల్సిన చోట గిరిజనుల దగ్గర నుంచి ఇక్కడ సిబ్బంది డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల జరిగిన రెండు సంఘటనలతో ఎస్టీ సెల్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. కేజీహెచ్‌లో మృతి చెందిన పసికందును సొంత గ్రామం తరలించడానికి అంబులెన్స్ ఇవ్వకపోవడంతో చిన్నారి తండ్రి బైక్‌పై తీసుకెళ్లడం, గిరిజన మహిళకు మంచం ఇవ్వకపోవడంతో రాజేంద్రప్రసాద్ వార్డులో కిందనే నిద్రించడం తదితర సంఘటనలు సంచలనమయ్యాయి. దీంతో ఎస్టీ సెల్ ప్రక్షాళనపై యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్టీ సెల్ పనితీరుపై ఆరా తీశారు. కలెక్టర్ మల్లికార్జున, అల్లూరి డీఎంహెచ్‌వో తదితరులు మంత్రితో మాట్లాడుతూ ఎస్టీ సెల్‌కు అదనపు సిబ్బందిని నియమించాలని, నిధులు పెంచాలని, అంబులెన్స్‌లు సమకూర్చాలని కోరారు.

సిబ్బంది బదిలీ

ఎస్టీ సెల్‌కు మొత్తం 11 మంది సిబ్బందిని కేటాయించినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ భాషా చెప్పారు. గతంలో పనిచేసిన సిబ్బందితో పాటు సెల్ ఇన్‌చార్జి రామకృష్ణను కూడా బదిలీ చేశామన్నారు. తాజాగా ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు ఎంఎన్‌వోలు, ఇద్దరు డ్రైవర్లు, సిబ్బంది ఒకరిని నియమించినట్లు వెల్లడించారు. ఈ సెల్ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. అలాగే రెండు అంబులెన్స్‌లు కూడా కేటాయించామని అల్లూరి డీఎంహెచ్‌వో వెల్లడించారు.

దూరదర్శన్ విలేకరిపై దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్: దూరదర్శన్ విలేకరిపై దాడి చేసిన ముగ్గురిపై పట్టణ సీఐ మోహనరావు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలో కొత్తూరు గ్రామానికి చెందిన దూరదర్శన్ చానల్ రిపోర్టర్ ఎం.శ్రీనివాసరావుపై సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన గొల్లవిల్లి గణేష్, దాడి కిశోర్, నామా సంజీవ్‌దేవకుమార్ దాడి చేసి గాయపర్చినట్లు సీఐ చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జర్నలిస్టుల నిరసన

జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం మీడియా ప్రతినిధులు బైటాయించారు. ప్రతికా స్వేచ్ఛకు భంగం కలిగించే చీడపీరుగులను కఠినంగా శిక్షించాలని నినదించారు.

కె.కోటపాడులో పట్టపగలే చోరీ



క్లూస్‌టీంతో బీరువా వద్ద వేలి ముద్రలు సేకరిస్తున్న దృశ్యం



చోరీ జరిగిన ఇళ్లు

- రెండిళ్లలో రూ.రెండు లక్షల నగదు, బంగారం అపహరణ

కె.కోటపాడు : మండల కేంద్రంలో మంగళవారం పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. కె.కోటపాడు నుండి సూర్రెడ్డిపాలెం వెళ్లే మార్గంలో పక్కపక్కనే ఉన్న ఇళ్లలో దొంగలు పడి నగదు, బంగారం దోచుకుపోయారు. చల్లా రామునాయుడు ఇంట్లో బీరువాలో ఉంచిన రూ. 7.25 తులాల బంగారం వస్తువులతో పాటు ఇంటి నిర్మాణానికి సిద్ధంగా ఉంచుకున్న రూ.లక్షా 50 వేల నగదును దొంగిలించుకుపోయారు. అదే విధంగా చల్లా వెంకట సత్యనారాయణ ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.50వేల నగదు అపహరించారు. రామునాయుడు, వెంకట సత్యనారాయణ మేస్త్రీ పనులకు వెళ్లగా, రామునాయుడు భార్య దేముడమ్మ పొలంలోకి వెళ్లారు. మధ్యాహ్నం ఇళ్లకు తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో గల బంగారం, నగదు లేకపోవడాన్ని గుర్తించి దొంగలు పడ్డారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ధనుంజయ్ సిబ్బందితో వెళ్లి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బందిని రప్పించి బీరువాలపై వేలిముద్రలు సేకరించారు.

నూకాంబిక నెల పండగ చాటింపు



ఘటాలకు పూజలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవాలయంలో ఈ నెల 19న అమ్మవారి నెల పండగ జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి నెల పండగ చాటింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారి గర్భాలయంలో ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ఘటాలతో ఊరేగుతూ అమ్మవారి పండగ చాటింపు చేపట్టారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న పీడీ లక్ష్మీపతి

మాకవరపాలెం: బాల్య వివాహాల నివారణే లక్ష్యంగా కృషి చేయాలని డీఆర్డీఏ పీడీ బి.లక్ష్మీపతి వెలుగు సిబ్బందికి సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సిబ్బంది, వీవోఏలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రుణాల రికవరీ, బ్యాంకు లింకేజీ ద్వారా రుణాల మంజూరు, నెలవారీ సమావేశలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుణ గ్రహీలంతా జీవనోపాధి పొందేలా చూడాలన్నారు. ఆర్థిక స్వావలంబన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత, బాల్య వివాహాలు, రక్తహీనత అంశాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం చినబాబు, సీసీలు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా.. ముగ్గురికి గాయాలు



సంఘటన స్థలంలో వ్యాన్

అరకులోయ రూరల్ : మండల కేంద్రం సమీపం వజ్రాల మెట్ట, హెలిప్యాడ్ మైదానంలో మంగళవారం అరకులోయ నుంచి చిన్నలబుడు పంచాయతీ పకనకుడి గ్రామానికి వెళుతున్న బొలెరో పికప్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో హుకుంపేట మండలం గతుం పంచాయతీ అమలగిరి గ్రామానికి చెందిన కిల్లో బన్ని(17), చిన్నలబుడు పంచాయతీ పకనకుడి గ్రామానికి చెందిన శ్యామ్(18)రమేష్(17) గాయపడ్డారు. కిల్లో బన్నికి కుడికాలు విరిగిపోగా, మిగిలిన ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, చిన్నలబుడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణ్‌కుమార్, పూర్ణ చందర్‌లు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం కిల్లో బన్నిని విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు వారు తెలిపారు.

ఎయిర్ కార్గోకు రైట్ రైట్!

- కొన్నాళ్లుగా విమానాశ్రయంలో నిలిచిన సరకు రవాణా



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎయిర్‌కార్గో రవాణాకు మార్గం సుగమం అయింది. విమానాశ్రయాల్లో నిర్దేశిత నిపుణులైన స్క్రీనర్లు లేని కారణంగా విశాఖ, విజయవాడ సహా దేశంలోని తొమ్మిది ఎయిర్‌పోర్టుల్లో జనవరి ఒకటి నుంచి ఎయిర్ కార్గో రవాణాకు బ్రేకులు పడిన సంగతి తెలిసిందే. ఈ విమానాశ్రయాల్లో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సరకు రవాణాను నిలిపివేసింది. ఇన్నాళ్లూ ఆయా విమానయాన సంస్థలే కార్గో స్క్రీనింగ్ వ్యవహారాలు చూసుకునేవి. ఇటీవల ఆ బాధ్యతలను బీసీఏఎస్ పర్యవేక్షిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా విమానాశ్రయాల్లో బీసీఏఎస్ నిబంధనలకు అనుగుణంగా నియమితులైన స్క్రీనర్లతోనే సరకు తనిఖీలు చేపట్టడం తప్పనిసరి చేసింది. వీటిని ఇప్పటికీ అమలు చేయని విమానాశ్రయాల్లో కార్గో బుకింగ్, రవాణాను నిలిపివేస్తూ బీసీఏఎస్ నిర్ణయం తీసుకుంది. ఇతర ఎయిర్‌పోర్టుల నుంచి కార్గో దిగుమతికి అభ్యంతరం చెప్పకుండా సరకులను రవాణా చేయడాన్ని ఆపింది. గతంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా ఒక కార్గో విమానాన్ని నడిపేది. కోవిడ్ ప్రభావంతో దానిని రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి సరకు రవాణాకు ప్రత్యేకంగా కార్గో విమానాలు నడవడం లేదు. ఇన్నాళ్లూ పాసింజరు విమానాల్లో వివిధ ప్రాంతాలకు కార్గో రవాణా జరుగుతోంది.

కార్గో రవాణాకు లైన్‌క్లియర్

విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోజుకు 80 వరకు పౌర విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున 300 టన్నుల సరకు రవాణా జరుగుతోంది. వీటిలో వైద్య పరికరాలు, అత్యవసర మందులు, రక్త పరీక్షల నమూనాలు, ఫార్మా, మత్స్య ఉత్పత్తులు, టెక్స్‌టైల్ వంటివి ఉన్నాయి. 45 రోజులుగా ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా నిలిచిపోవడంతో సంబంధీకులు రోడ్డు, రైలు మార్గాల్లో తమ సరకు/ఉత్పత్తులను పంపిస్తున్నారు. మరీ అత్యవసరమైతే తేలికైన వస్తువులు, సరకులు, మందులు, రక్త నమూనాలు వంటి వాటిని విమాన టిక్కెట్టు బుక్ చేసుకుని తమ వెంట తీసుకెళ్లి వస్తున్నారు. ఇలా రవాణా చేసే సమయంలో ఆక్సిజన్ సరిగా అందక పెద్ద ఎత్తున రొయ్య పిల్లలు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో విశాఖ విమానాశ్రయం నుంచి రొయ్య పిల్లలను రవాణా/ఎగుమతులకు అనుమతులిస్తూ పౌర విమానయానశాఖ జాయింట్ డైరెక్టర్ అవధేష్ ప్రతాప్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో విశాఖతో పాటు విజయవాడ విమానాశ్రయం నుంచి కూడా ఇండిగో సంస్థ ద్వారా ఎయిర్ కార్గోకు లైన్ క్లియర్ చేస్తూ త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నట్టు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

మారుజాతి కలప పట్టివేత



కలపతోపాటు సీజ్ చేసిన ట్రాక్టర్

రాజవొమ్మంగి : మండలంలోని గొబ్బిలమడుగు అటవీప్రాంతం నుంచి 16 మారు జాతి (బిళ్ళ) కలప దుంగలతో తరలిపోతున్న ఏపీ 39 ఎస్ఎం 6683 నెంబర్ గల ట్రాక్టర్‌ను రాజవొమ్మంగి అటవీఅధికారులు పట్టుకొన్నారు. దీనిని స్థానిక అటవీ క్షేత్ర కార్యాలయానికి తరలించారు. సోమవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. కలప విలువ రూ.22,847 ఉంటుందని ఆ ప్రాంతంలో విధుల్లో వున్న అటవీఅధికారి బాపిరాజుదొర తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి మల్లికార్జున అనే వ్యక్తిపై కేసు నమోదు చేసామన్నారు. ఈ దాడిలో దొరమామిడి, పాపంపేట బీటు అటవీ అధికారులు అర్జునుడు, లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు నడవండి...అండగా ఉంటాం

- గిరిజనులకు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పిలుపు
- పీకేగూడెంలో సీఆర్‌పీఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం
- పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు



మాట్లాడుతున్న చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్, పక్కన సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్, సీఐ



గిరిజనులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న పోలీసు అధికారులు



మాజీ మావోయిస్టు దళసభ్యుడు వంతల గాసితో మాట్లాడుతున్న చింతపల్లి అదనపు ఎస్పీ

గూడెంకొత్తవీధి : ఏ విషయంలోనూ అధైర్యపడకండి... ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో అభివృద్ధి వైపు అడుగులు వేయండి.. మీవెంట అండగా మేం ఉంటాం...దేశరక్షణతో పాటు మావంతుగా గిరిజనులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ అన్నారు. మంగళవారం గూడెం కొత్తవీధి సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ సహాయ కమాండెంట్ బీరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పీకే గూడెంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఆదివాసీ గిరిజనులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాలు ఇంతకాలం కేవలం మావోయిస్టుల కారణంగానే అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇటీవల కాలంలో గిరిజనులంతా అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం గిరిజన గ్రామాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో రహదారులు, సెల్ టవర్ల నిర్మాణాలు పూర్తయితే రవాణా, సమాచార వ్యవస్థ మెరుగుపడి గిరిజనులకు ఆదాయ మార్గాలతోపాటు వైద్య సదుపాయాలు సమకూరుతాయన్నారు. సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ బీరేంద్రకుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తమ కేంద్ర పారా మిలటరీ బలగాలు సేవా భావంతో అనేక సంక్షేమ, సామాజిక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు దుప్పట్లు, చీరలు, వంట పాత్రలు, యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గిరిజనులతో కలసి చింతపల్లి ఏఎస్పీ, పోలీసు అధికారులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి, సీఆర్‌పీఎఫ్, సివిల్, ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు.

అజ్ఞాతంలో ఉండి సాధించేది ఏమిటి?

ఇళ్లు, పొలాలు, కుటుంబాలను వదిలి అడవులను పట్టుకుని అజ్ఞాతంలో ఉండి మీరు ఇన్నాళ్లల్లో సాధించింది ఏమిటని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ మావోయిస్టులను ఉద్దేశించి అన్నారు. ఏ ఒక్క గిరిజనుడికైనా ఉద్యోగం కల్పించారా? ఉపాధిని ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. పీకే గూడెంలో మంగళవారం నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంకు గతంలో మావోయిస్టు గాలికొండ ఏరియా కమిటీ దళంలో పనిచేసిన మాజీ మావోయిస్టు వంతలగాసి హాజరయ్యారు. అతనితో ఏఎస్పీ కొద్దిసేపు మాట్లాడారు. గిరిజనుల పట్ల నిజంగా మావోయిస్టులకు ప్రేమ, అభిమానం ఉంటే వారు అనాదిగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ప్రభుత్వంపై శాంతియుతంగా పోరాటం చేయవచ్చన్నారు. దీనికి ఆయుధాలు అవసరం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇన్‌ఫార్మర్ల పేరిట అమాయక గిరిజనులను హత్యలు చేయడం, రహదారులు నిర్మించే యంత్రాలను, సెల్ టవర్లను ధ్వంసం చేస్తే మావోయిస్టుల పట్ల గిరిజనులకు ప్రేమ ఎందుకు కలుగుతుందని అన్నారు. ఇప్పటికైనా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు అగ్రనేతలు, దళ సభ్యులు జనజీవన స్రవంతిలోకి వస్తే తాము స్వాగతిస్తామన్నారు.

క్లుప్తంగా

ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి



గురుకుల పాఠశాలలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

తుమ్మపాల : పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతిరావుపూలే జీవితంలో ప్రధాన సంఘటనలను విద్యార్థులకు వివరించారు. కులమతాలకతీతంగా ఆయన సేవలకు గుర్తుగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గురుకులాలు ఏర్పాటుచేశారన్నారు. ఆయన జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు మహేంద్రనాథ్ పట్నాయక్, మదన్‌మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తూరులో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కొత్తూరు పంచాయతీ సచివాలయం-2 పరిధి కాలేజీ జంక్షన్, భవానీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాల్సిందిగా కోరారు.

రెండో రోజూ భానుడి భగభగలు



కశింకోట : కశింకోట ప్రాంతంలో వరుసగా రెండో రోజూ ప్రజలు భానుడి భగభగలకు విలవిలలాడారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం వేడిగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, పిల్లలు ఎండ వేడిమితో పాటు, ఉక్కబోతతో మరింత ఇక్కట్లకు గురయ్యారు. చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై, వాతావరణం చల్లబడటంతో జనాలు కాస్త ఉపశమనం పొందారు.


నేడు నూకాంబిక హుండీ లెక్కింపు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులు, పరిశీలించే భక్తులు, పంచె, కండువా ధరించి ఉదయం 7 గంటలకు దేవస్థానం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

మీటర్	రాజా
రంగమార్తాండ	సత్యనారాయణ స్క్రీన్-1
దంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
దసరా	పర్తిసాయి
భూతవైద్యుడు(ది పోప్స్ ఎగ్జార్సిస్ట్)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 3,261 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,130	4,290
మొదటి రకం	3,980	4,160
రెండో రకం	3,430	3,970
మూడో రకం	3,100	3,420

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 354 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 267 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కారుణ్య వసంతం.. రంజాన్ మాసం

- ఉపవాసాలు, ప్రార్థనల్లో ముస్లిం సోదరులు
- మూడో దశ ఉపవాసాలు ప్రారంభం



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనకాపల్లిరూరల్ : ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో ప్రత్యేకం. ఈ నెలంతా వారు అల్లాహ్ ప్రార్థనలో గడుపుతారు. ఉపవాసాలు ఉంటారు. దీక్ష సమయంలో మంచినీరు కూడా ముట్టుకోరు. అల్లా కరుణ కోసం చేసే ఈ కఠోర దీక్షలను అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల్లో పెద్దలతో పాటు చిన్నారులు సైతం ఆచరిస్తున్నారు. అనకాపల్లిలో సుమారు 10 వేల మంది, యలమంచిలిలో దాదాపు 2 వేల మంది ముస్లింలు ఉన్నారు. అనకాపల్లి శారదానగర్ మదీనా మసీదు, పెరుగు బజార్, యలమంచిలిలోని జామియా మసీదులతో పాటు తుమ్మపాల, కశింకోట, బయ్యవరం, రేగుపాలెం మసీదుల్లో ముస్లింలు రోజూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఇంటిల్లిపాదీ ఉపవాసాలు కొనసాగిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తుండడం విశేషం.

ఒక నెల.. మూడు దశలు

ప్రస్తుతం రంజాన్ మాసంలో మూడో దశ ప్రారంభమైంది. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు 30 రోజులు కఠిన రోజా(ఉపవాస) దీక్ష ఆచరిస్తారు. చివరి రోజు నెలవంకను చూసి పండగ చేసుకుంటారని మాత్రమే తెలుసు. కానీ ఈ కఠోర దీక్షలో మూడు దశలుంటాయి. మాసంలో తొలి పదిరోజులను అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రార్థనలతో పూర్తి చేశారు. రెండో దశ ఉపవాసాలు(రోజాలు) పూర్తయ్యాయి. 30 రోజులను మూడు దశలుగా విభజించారు. మొదటి దశను కారుణ్య దినాలు, రెండోది మన్నింపు రోజులు, మూడో దశ నరక విముక్తిగా పరిగణిస్తూ రోజాలను పాటిస్తారు. రోజా అంటే తినకుండా దీక్ష చేయడమే కాదు, మనిషి పరివర్తనతోపాటు, అన్ని అవయవాలు అల్లా కోసం పని చేసేలా చూడడం.

గడచిన రోజులు రహమత్

తొలి పది రోజులు దేవుడు తన ఆకాశ వాకిళ్లు తెరచి, విస్తారంగా దీవెనలు అందిస్తారని నమ్మకం. ఈ రోజుల్లో దుర్లక్షణాలు వదిలేసి నిర్మలమైన మనస్సుతో అల్లాను ప్రార్థించాలని మత పెద్దలు చెబుతున్నారు. అలా చేస్తే దానికి ఫలితం తప్పక దక్కుతుందని రోజాదారుల విశ్వాసం.

రెండో దశ మగ్ఫిరత్

రెండో దశలో ఏ మంచి పని చేసినా దేవుడు 70 రెట్లు ప్రతిఫలం అందిస్తారని నమ్మకం. వీటిని మన్నింపు(మగ్ఫిరత్) రోజులుగా పేర్కొంటారు. సత్కార్యాలు చేసేందుకు ప్రాధాన్యం ఇస్తూ జరిగిన పాపాలు మన్నించాలని వేడుకుంటూ ప్రార్థనలు చేస్తారు.

మూడో దశ ఆజాదీ

మూడోదశలోని పది రోజులు పాప విముక్తికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నరకానికి వెళ్లే క్రియల నుంచి తమను కాపాడాలని వేడుకుంటారు. ఇందుకు చివరి పదిరోజులు కఠిన దీక్ష ఆచరిస్తారు. ఎతెకాఫ్‌గా పిలిచే ఈ చివరి దినాల్లో దీక్షాపరులు పూర్తిగా మసీదులోనే గడుపుతారు. కుటుంబంతో సంబంధాలు దాదాపుగా వదిలేస్తారు. నిత్య ప్రార్థనలు, ఖురాన్ పఠిస్తారు. ఇలా చేయడం వల్ల ఆ మసీదు పరిధిలో లేదా గ్రామాన్ని అల్లా సమృద్ధిగా దీవిస్తాడని నమ్మకం.

సర్వపాప హరణం.. ఖురాన్ పఠనం

పవిత్ర గ్రంథం ఖురాన్ పఠనానికి రంజాన్ మాసంలో ముస్లింలు అధిక ప్రాధాన్యత ఇస్తారు. రంజాన్‌కు, ఖురాన్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. రంధామ్ అనే అరబ్బీ పదం కాలక్రమేణా రంజాన్‌గా మారింది. పాప పరిహారాల కోసం ఈ రంజాన్ నెల అనువైనది. ఈ మాసంలో ఖురాన్ పూర్తిగా వినడం, పఠించడం ముస్లింలు చేస్తారు. ఖురాన్‌ను నెమ్మదిగా అవగాహన చేసుకుంటూ చదవాలి. ప్రతీ రోజూ ఖురాన్ చదవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ముస్లిం సోదరుల విశ్వాసం. ఈ గ్రంథంలోని 30 భాగాలు కంఠస్థం చేసిన వారికి ఖురానే హఫీజ్ లేదా హజ్రత్ అంటారు. ఏటా రంజాన్ మాసంలో రాత్రి నిర్వహించే ప్రత్యేక తరావీహ్ నమాజ్‌లో ఖురాన్ పఠిస్తారు. ప్రత్యేక తరావీహ్ నమాజ్ ద్వారా ఖురాన్ గ్రంథాన్ని 26 రోజుల్లో పూర్తి చేస్తారు.

ఖురాన్ పఠనం మహా పుణ్యం



ఖురాన్ పఠించడం ద్వారా సకల పాపాలు హరిస్తాయి. ముఖ్యంగా రంజాన్ మాసంలో దీని పఠనం తప్పనిసరి. ఈ మాసంలో ఒక్కసారి చదివితే 70 సార్లు చదివిన పుణ్యాన్ని అల్లా ప్రసాదిస్తారు. ముస్లింలు ప్రతి ఒక్కరూ దీనిని నేర్చుకోవడం మంచిది. ఖురాన్‌లోని భాగాల్లో ఎన్నో అర్థాలు, పరమార్థాలున్నాయి.

– షేక్ అజ్మీర్ వలీ, అనకాపల్లి

నమాజ్‌తో ఆరోగ్యం, క్రమశిక్షణ



పవిత్ర రంజాన్ మాసంలో ఖురాన్ వెలువడింది. దీన్ని చదివేందుకు వయస్సుతో పనిలేదు. కేవలం చదవడం కాదు, అర్థం కూడా తెలుసుంటేనే అందులోని పదాల మహత్యం తెలుస్తుంది. రంజాన్ మాసంలో ఉపవాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. నమాజు ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణ అలవడతాయి.

– సయ్యద్ కరీముల్లా, అనకాపల్లి

వాత్సల్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట : మండలంలో మిషన్ వాత్సల్య పథకం కింద ఉపకార వేతనం పొందగోరు అర్హులు 15లోగా అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. తల్లిగాని, తండ్రిగాని, ఇద్దరూ లేని అనాథ పిల్లలకు బాసటగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 18 ఏళ్లలోపు పిల్లలకు నెలకు రూ.4 వేలు అందిస్తారని పేర్కొన్నారు. దీనిలో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వంతున నిధులు సమకూరుస్తాయన్నారు. వితంతువు లేదా కోర్టు ద్వారా లేదా పెద్దల సమక్షంలో విడాకులు తీసుకున్న, కుటుంబం వదిలేసిన తల్లి పిల్లలు, అనాథ బాలలు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న వారు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సహాయ తల్లిదండ్రుల పిల్లలు, బాల కార్మికులుగా గుర్తించిన పిల్లలు, బాల న్యాయ చట్టం-2015 ప్రకారం సంరక్షణ అవసరమైన పిల్లలు, ఇల్లులేని బాలలు ఈ పథకానికి అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు జనన ధ్రువీకరణ పత్రం, తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుని ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, రైస్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫోటో, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత బ్యాంకు ఖాతా లేదా తల్లిదండ్రులు, సంరక్షకునితో కలిసి ఉన్న జాయింట్ అకౌంట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతంలో రూ.96 వేలు లోపు ఉన్నవారు మాత్రమే ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

అన్ని నియోజకవర్గాల్లో 'ఆప్'



ఆమ్ ఆద్మీ పార్టీ నేతల సంబరాలు

అనకాపల్లిటౌన్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు తెలిపారు. పార్టీకి జాతీయ హోదా లభించడం పట్ల స్థానిక నెహ్రూ చౌక్‌లో మంగళవారం ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా హరనాథ్ బాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అధినేత కేజ్రీవాల్ త్వరలోనే దేశవ్యాప్తంగా పర్యటించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ శ్రీనివాసరావు, కె.నారాయణరావు, పి.బాబ్జీ, కె.వి.రమణ, శరగడం రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన



మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల గ్రామంలో మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాల గురించి వివరించారు. ఎవరికైనా రైతు భరోసా రాకపోతే స్థానిక ఆర్బీకే కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. రైతు భరోసా దరఖాస్తుల నమోదు కొత్తగా జరుగుతున్నట్లు తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మట్టి నమూనాల పరీక్షల యొక్క అవశ్యకతను వివరించారు. మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, వీఏఏ మనీషా, ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. తాగునీటికి గండం

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు



మూత పడిన దేశపాత్రునిపాలెం ఆర్వో ప్లాంటు

పరవాడ: గ్రామీణ ప్రజల దాహార్తి తీర్చడానికి సింహాద్రి ఎన్టీపీసీ రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్లు మరమ్మతులతో మూలకు చేరాయి. ఫలితంగా మండలంలో కలపాక, దేశపాత్రునిపాలెం గ్రామాల ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. శుద్ధి చేసిన మంచినీటిని అందించాలన్న లక్ష్యంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్లు నిర్వహణ లేక అనతికాలంలో మూతపడ్డాయి. దీంతో ప్రజలు దప్పిక తీర్చుకునేందుకు మైళ్ల దూరం పరుగులు తీయాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి

సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని అందించడానికి ఆరేళ్ల కిందట ఆర్వో ప్లాంట్లు నిర్మించింది. కొంత కాలం వరకు సజావుగా పనిచేసిన ఆర్వో ప్లాంట్ల నిర్వహణ లేకపోవడంతో మంచినీరు బాగోలేదన్న కారణంతో స్థానికులు వినియోగించడం మానేశారు. దీంతో ప్లాంటులో యంత్ర పరికరాలు పాడైపోయి మూతపడింది. ప్రస్తుతం ప్రజలు తాగునీటి కోసం మైళ్ల దూరంలో గల వెన్నలపాలెం, పరవాడ ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లకు పరుగులు తీస్తున్నారు.

➡ జీవీఎంసీ 79 వార్డులో ఎన్టీపీసీ సౌజన్యంతో రూ.11.60 లక్షల వ్యయంతో 2018లో నిర్మించిన ఆర్వో ప్లాంటు కొంత కాలం పనిచేసింది. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్లాంటు పనిచేయడం లేదు. దీంతో స్థానికులు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. మోటారు కూడా రిపేర్లతో మూలుగుతోంది. మరమ్మతులు చేసి ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

కలపాక ఆర్వో ప్లాంటు మరమ్మతులు త్వరలో చేపడతామని సర్పంచ్ బొండా కనకారావు చెప్పారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం నుంచి పైపులైన్ ద్వారా ఆర్వో ప్లాంటుకు మంచినీటిని సరఫరా చేసి శుద్ధి చేసిన తర్వాత ప్రజలకు సరఫరా చేయనున్నట్లు సర్పంచ్ కనకారావు చెప్పారు.

పూలే అడుగుజాడల్లో నడవాలి



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో ఎంపీపీ గొర్లి సూరిబాబు



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

అనకాపల్లి రూరల్: అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ గొర్లి సూరిబాబు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలే జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శమని, కుల, మతా భేదాల్లేని సమాజం కోసం ఆయన కృషి చేశారని కొనియాడారు.

ప్రజల్లో కులతత్వానికి వ్యతిరేకంగా చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధర్మారావు, ఎంపీటీసీలు ఈగల రామనాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, గూన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలనకు, మద్యపానం, ధూమపానానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. బాలికలకు, మహిళలకు చదువు చెప్పేందుకు ఎవరూ ముందుకు రాకపోతే తన భార్య సావిత్రీబాయిపూలేను మహిళా ఉపాధ్యాయురాలిగా చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, విద్యార్థి సంఘ నాయకులు ఫణీంద్ర, స్థానిక నాయకులు కోరుబల్లి శంకరరావు, విత్తనాల పోతురాజు, నరాలశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

సందడిగా గొర్రెల పెంపకందార్ల సంఘ ఎన్నికలు



గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షురాలు ఈపు చిన్నమ్మలుకు అభినందన

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో మురళీ కృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య రసవత్తరంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ మద్దతిచ్చిన ఈపు చిన్నమ్మలు నాలుగు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం, గొబ్బూరు గ్రామాలకు చెందిన ఈ సంఘానికి అధ్యక్షురాలిగా చిన్నమ్మలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పశు వైద్యాధికారి సీహెచ్ చైతన్యమణి ప్రకటించారు. ఉపాధ్యక్షునిగా ఒమ్మి గంగరాజు, కార్యదర్శిగా ధూళి అప్పారావు, కోశాధికారిగా పక్కుర్తి నాగఅప్పారావు, పాలకవర్గ సభ్యులుగా ఈసరపు రాజు, కొండ్ర చిన దేముడు, పక్కుర్తి అప్పలరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల సందర్భంగా కాసేపు రెండు వర్గాల మధ్య వివాదం ఏర్పడగా ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి జోక్యం చేసుకుని, వివాదాన్ని పరిష్కరించారు. అధ్యక్షురాలిగా ఎన్నికైన చిన్నమ్మలును వైస్ ఎంపీపీ నమ్మి మీనా, సర్పంచ్‌లు కోన అరుణ, కొట్టె రాము, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, మండల యాదవ సంఘం కార్యదర్శి నమ్మి నరసింగ యాదవ్, పార్టీ మండల యువజన విభాగం కార్యదర్శి తిర్రి శ్రీనివాసరావు తదితరులు సన్మానించారు. పాలక వర్గాన్ని అభినందించారు.

ప్రజలందరి నమ్మకం జగన్



తాళ్లపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మహిళకు బ్రోచర్ పంపిణీ



ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సచివాలయ కన్వీనర్ లగిశెట్టి గణేష్



జమాదులపాలెంలో కరపత్రాలు అందిస్తున్న మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సోమునాయుడు



పుట్టవీధిలో మహిళకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్, బ్రోచర్ అందిస్తున్న జానకిరామరాజు



వేల్పులవీధిలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్ : పట్టణంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు వేడుకగా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ పుట్టవీధిలో 82వ వార్డు ఇన్‌చార్జి మందపాటి జానకిరామరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. గృహ యజమానుల అనుమతితో ఇళ్ల గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గైపూరి రాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

83వ వార్డు పరిధి వేల్పులవీధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వైద్యుడు జి.రామ్మూర్తి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అభివృద్ధిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శంకరరావు, శ్రీరామ్మూర్తి, అప్పారావు, చిన్న, కన్నేశ్వరరావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం బీసీ కాలనీలో సచివాలయ కన్వీనర్ లగిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

ఇళ్ల గోడలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. పార్టీ బ్యాడ్జీలు అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా తీరుపై రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. అచ్చెర్ల గ్రామంలో సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పాలనపై ప్రజాభిప్రాయం తీసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాలను అందజేశారు.

కశింకోట : మండలంలోని జమాదులపాలెంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనకాపల్లి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషుల ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. స్టిక్కర్లను అతికించి, బ్యాడ్జీలను అందించారు.

ఇంటింటా కుళాయి పనులకు శ్రీకారం



ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్ : మండలంలోని పిసినికాడ సచివాలయం పరిధిలో ఇంటింటా మంచినీటి కుళాయి కనెక్షన్ పనులకు మంగళవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఈ గ్రామంలో ఇంటింటా కుళాయిల కోసం రూ.36 లక్షలు నిధులు మంజూరైనట్టు చెప్పారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందులో సర్పంచ్ యల్లపు రమేష్, దాడి రాము, ఎంపీటీసీ మొల్లేటి హేమ శివాజీ, దాడి రామ్ త్రినాథ్, వెలగా కోటి, దాడి ప్రసాద్, బొడ్డేడ లక్ష్మి, మల్ల నర్సింగరావు, మళ్ల వెంకట్రావ్ పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

అనకాపల్లిటౌన్ : పట్టణంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. గవరపాలెం పరమేశ్వరి పార్కులో ఉత్తరాంధ్ర బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వేదిక అధ్యక్షుడు ఆడారి కుమారస్వామి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీమునిగుమ్మం వద్ద టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మళ్ల సురేంద్ర, నెహ్రూచౌక్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు



పి.బోనంగిలో బోయమాంబను దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ: పెదముషిడివాడ, పి.బోనంగి శివారు వీఎల్ఎన్ పురం గ్రామాల్లో కొలువుదీరిన శ్రీ పైడిమాంబ, బోయమాంబ అమ్మవార్ల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెదముషిడివాడలో అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో సుందరంగా అలంకరించారు. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, గ్రామ పెద్దలు పల్లా అప్పారావు(కబడ్డీ), యలమర్తి బుజ్జి, బలిరెడ్డి అప్పారావు తదితరులు దర్శించుకున్నారు. రాత్రికి గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ బాణ సంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

- పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్ పురంలో బోయమాంబ అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారిని సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బండారు బోయన్న, చిన్నారావు తదితరులు దర్శించుకున్నారు. రాత్రికి బాణ సంచా వెలుగుల మధ్య అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు.

సత్యసాయి పాదుకల వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక నీలకంఠరావు వీధి ఆదిభేతాళ రామ మందిరంలో మంగళవారం శ్రీసత్యసాయిబాబా పాదుకల వార్షికోత్సవంలో ఎంపీ బీవీ సత్యవతి దంపతులు పాల్గొని పూజలు చేశారు. అంతకు ముందు చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు సూరిశెట్టి రమణ అప్పారావు, పెతకంశెట్టి శివ, వెంకటలక్ష్మిపాల్గొన్నారు.